# పది రూపాయల నోటు

-గరిశకుర్తి రాజేంద్ర

"మనిషి ఒక కంటితో ఎంత దూరం చూడగలడో రెండో కంటితోనూ అంతే చూడగలడు. మరి ఆ దేవుడు ఒకటితో సరిపెట్టక రెండు కళ్ళెందుకు యిచ్చి నట్టు? సమదృష్టిని అలవరచుకొమ్మని. కానీ, మనిషిలో మచ్చుకైనా కనిపించదు ఈ సుగుణం."

○ ○ ○

ఉదయం సమయానికి తయారు కావడం ప్రతిరోజూ ఓ కార్గిల్ యుద్ధం చేసిన పనే. నేను పోస్టాఫీసుకు, 'రమ' బడికి, 'సంవిద్' స్కూలుకు టంచనుగా తొమ్మిది కల్లా ఇంట్లోంచి బయటపడాలి. ఉదయం లేస్తే చాలు ఎవరి హడావిడి వారిది. వంట పని ముగించుకోవడం, టిఫిన్లు సర్దుకోవడం మధ్యలో మాకు పనిమనిషికి కాఫీ, టీలు అందించడం. ఇవి చాలవన్నట్లు "హ్రీంకారాసన గర్భిత" అన్నట్లు అమ్మవారి పూజ. ఒకటే హడావిడి. ఇంటికి తాళం వేసి మోపెడుపై బయలుదేరే వరకు ఒకటే టెన్షను. తాళంవేసి బయలుదేరేంతలో "ట్రింగ్, ట్రింగ్" అంటూ టెలిఫోను పిలుపు. అసహనంగానే తాళం తీసి ఫోను లిఫ్టు చేస్తే లైనులో శ్రీకాంత్.

నేను చెప్పిన ఆ పదిరూపాయల నోటు దొరికిందా! ఒకే ఒక ప్రశ్న. పది రూపాయల నోటు కోసం ఈ సమయంలో హైదరాబాద్ నుంచి ఫోన్ చేయాలా? ఇంతకు ముందు కూడా ఒకటి రెండుసార్లు ఫోన్ చేసి తానెప్పుడో ఒక పది రూపాయల నోటు దాచిపెట్టమని చెప్పానని, అది వెతికి పెట్టమని చెప్పాడు. ఆ విషయం నేనంతగా పట్టించుకోలేదు. అవసరమయితే ఏదో ఒక పదిరూపాయల నోటు, పాతదే దొరికిందని చెప్పి, ఇచ్చి తప్పించుకోవాలనుకున్నాను. కానీ తాను ఆ నోటుపై సంతకం చేసి, తేది వేశానని తనకా నోటే కావాలని రెట్టించడంతో నాకు తప్పించుకొనే అవకాశం లేక పోయింది. అలాగే వెతికి పెడతాను. ఇంతకూ నీ రాక ఎప్పుడు? ప్రశ్నించాను నేను. జవాబు చెప్పకుండా నోటు వెదకమని హెచ్చరించి ఫోను 'కట్' చేశాడు. ఇంటికి తాళం వేసి బయలుదేరుతూ రేపు ఆదివారం ఇల్లంతా గాలించి ఆ నోటును పట్టుకోవాలి దృఢంగా నిశ్చయించుకున్నాను నేను.

○ ○ ○

'ఆదివారం'..

ఈ టీవిలో భాగవతం చూస్తూ కూచున్నాను. నమస్కారం బావా! అన్న పలకరింపుతో ప్రవేశించాడు చంద్రశేఖర్. చంద్రశేఖర్ నా మూడవ బావమరిది.

శేఖర్! రా.. రా... అంటూ ఆహ్వానించాను. మనిషెందుకో కొంచెం ఆందోళనగా, అశాంతిగా కనిపించాడు. కుశల ప్రశ్నలయిపోయాక 'టీ' త్రాగుతూ కూచున్నాం. 'మా టివి'లో 'పాడుతా తీయగా' తీయగా వినిపిస్తుంది. 'రమ' వంట పనిలో 'సంవిద్' ఆటలోను బిజీ కాగా మేము మాటల్లో పడిపోయాం.

ఊ.. చెప్పు! ఫోను కూడా చేయకుండా ఇలా హఠాత్తుగా ఎందుకూడిపడినట్టు? హాస్య ధోరణిలో ప్రశ్నించాను నేను.

అదే, నీకు చెప్పిన విషయం ఏం చేశావు బావా? ఆత్రంగా అడిగాడు శేఖర్.

ఏ విషయం? తెలిసినా తెలియనట్లు నటించాను నేను.

మన పిల్లల 'పెళ్ళి' విషయం. అసహనంగా అన్నాడు శేఖర్.

'శ్రీకాంత్‌కా అభిప్రాయం లేనట్లుంది!'

'అదేమిటీ? నీవు చెబితేనే కొడుకు వినడా బావా!' నిష్ఠురంగా అన్నాడు చంద్రశేఖర్.

'అయినా నాకు అర్థం కాక అడుగుతాను. అంత తొందరేమిటట?' కొంచెం కోపంగానే అన్నాను నేను.

పెద్దన్నయ్య బిడ్డ పెళ్ళై అయిదేళ్ళయింది. ఇప్పుడు కొడుకు పెళ్ళి కూడా అయిపోతుంది. నా ఆడపిల్లలిద్దరూ అలాగే వున్నారు. మేన సంబంధం తయారుగా వుండగా ఆలస్యం దేనికి?

## ప్రశ్న

సముద్రాన్ని / నది చల్లారుస్తుంది
ఆకాశాన్ని / ఆవిరి ఓదారుస్తుంది
అనంత విశ్వాన్ని / చినుకు స్పర్శిస్తుంది
చీకటిని వెన్నెల / ఆదుకుంటుంది
మరి నువ్వు అమ్మని
అక్కున చేర్చుకోవేం??

-గుడిమెట్ల గోపాలకృష్ణ

## శాంతి పావురాలు

సమాచార పత్రికల్ని మోసుకొచ్చేవి
పత్రిక రెక్కలే
జంట గువ్వల మోసుకొచ్చాయ్
గ్రీష్మ తాపం
జీవం ఉట్టిపడే ఛాయాచిత్రం
త్రాగునీరును
త్రవ్విన గుంతల్లోంచి తోడినట్టు
తోడిన వాగు చలమల్లో
బొక్క బోర్లా పడుకుని
దాహం తీర్చుకున్నట్లు
నల్లా నీటి కోసం వేట మరో పక్క
దప్పిక తీర్చుకుంది ఎంచక్క
వాగులూ వంకలూ
చెరువులూ, లోయలూ
అన్నీ అడుగంటుతున్నాయ్
పక్షీ, పావురం, గువ్వల జంట
ట్యాప్ నీటిని వేటాడితే
మనిషి నీటి ప్యాకెట్ వైపు
మినరల్ వాటర్ వైపు
పరుగిడుతున్నాడు
నీళ్ళ కోసం ఒకనాటి...
నీళ్ళలా ఖర్చు పెడుతున్నాడు
నల్లాలు సైతం ఎండిపోతే
శాంతి కపోతాలు
నీటి పొట్లాలను
ముక్కున కరచుకొని
మోసుకుపోయేట్టున్నాయ్
నీటి చుక్కే దిక్కులేకపోతే
మానవ, దానవుల్లేరు
పశు పక్ష్యాదుల్లేవు
ప్రాణికోటి లేదు
నీటి పొదుపు
జలసంరక్షణ
జల జగడాలకు తెర
జనం సాగిపోతుంది ముమ్ముందర
(మే 'పత్రిక' ముఖచిత్రం
మదిలో మెదలిన భావచిత్రం)

-పోలేపల్లి వెంకటరెడ్డి

మేన సంబంధమే కావచ్చు. పిల్లలకు ఇష్టం కావాలిగా! అయినా శ్రీకాంత్‌తో చెప్పి ఒప్పించే ప్రయత్నం చేస్తాను. హామీ ఇచ్చాను నేను.

నా జవాబు అతనికి సంతృప్తి కలిగించినట్లు లేదు! భోజనం అయిందనిపించి వెళ్ళిపోయాడు చంద్రశేఖర్. అయినా అతనిలో ఆశ పూర్తిగా చావలేదు.

❍ ❍ ❍

మళ్ళీ ఒకసారి శ్రీకాంత్ ఫోనుచేసి ఆ నోటు గుర్చి హెచ్చరించడంతో బద్ధకాన్ని వదిలించుకొని ఇల్లంతా అణువణువూ గాలించాను. నా శ్రమ ఫలించింది. ఆ పది రూపాయల నోటు దొరికింది. దానిని చాలా జాగ్రత్తగానే దాచిపెట్టాను. అతి జాగ్రత్త వల్ల ఎక్కడ దాచిపెట్టానన్న విషయం మరచిపోయాను. మొత్తం మీద కథ సుఖాంతమవడంతో తేలికగా ఊపిరి పీల్చుకున్నాను. ఆ నోటును జాగ్రత్తగా పరిశీలిస్తే దానిపై ఒక తేదీ వేసి పెట్టాడు శ్రీకాంత్. ఆ తేదీ ఏమై వుంటుందని పరిశోధించగా నా మెదడ్లో ఒక మెరుపు మెరిసింది. అది శ్రీకాంత్ 'బర్త్‌డే'... ఆ 'బర్త్‌డే'కు వాడు కరీంనగర్‌లో వున్నాడు.

❍ ❍ ❍

శ్రీకాంత్! మీ మామ చంద్రశేఖర్ వచ్చి వెళ్ళాడు" అన్నాను.

'ఎందుకట?' అసహనంగా అన్నాడు శ్రీకాంత్. వాడికి కోపం, అసహనం పాలు ఎక్కువ.

'ఇంకెందుకు? నిన్ను అల్లుణ్ణి చేసుకోడానికి.'

'ఇంకా నయం. ఈ మాట ఇప్పుడంటే అన్నావు. మళ్ళీ ఎప్పుడూ అనకు.' ఒకే ఒక్క మాటతో నా సంభాషణను 'కట్' చేశాడు మరో మాటకు అవకాశమీయకుండా.

నాకే వినని వాడు వాళ్ళమ్మకూ వినడన్న విషయం, నాకూ, వాళ్ళమ్మకూ బాగా తెలుసు.

'అనవసర విషయాలలా వుంచు. నా పది రూపాయల నోటు సంగతేం చేశావు?' తాడో, పేడో తేల్చుకొనే ధోరణిలో అడిగాడు శ్రీకాంత్.

నేను చాలా నిబ్బంగా వున్నాను. ఆ నోటు దొరికుండకపోతే నా పరిస్థితి మరోలా వుండేది. 'నోటు' వాడి చేతికందిస్తూ, "నాకు తెలియకడుగుతాను, ఏమిటట! దీని ప్రత్యేకత!"

'ఎలాగూ కరీంనగర్ వెళ్తున్నాంగా! అక్కడే అందరి ముందే విప్పుతాను ఈ సస్పెన్సు 'ముడి'. నన్ను మరింత ఊరిస్తూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు వాడు.

'కొఱకరాని కొయ్య' అనుకుని నా కోపాన్ని అణుచుకోక తప్పింది కాదు నాకు.

❍ ❍ ❍

దసరా మరునాడు పెద్ద బావమరిది కొడుకు 'ఎంగేజ్'మెంట్. దసరాకందరూ అక్కడికే రావాలని 'ఆర్డరు' వేశారు 'మల్లారం ఎస్టేటు' వాళ్ళు. అంటే మా మామగారు. తల ఊపింది సంతోషంగా నా శ్రీమతి రమ. తోకాడించక తప్పింది కాదు నాకు.

భోజనాలు చేస్తూ కుటుంబ సభ్యులమంతా మాటల్లో పడిపోయాం. చంద్రశేఖర్ శ్రీకాంత్‌ను పెళ్ళి కొప్పించేభారం వాళ్ళతండ్రిపై అంటే మా మామగారిపై వేసినట్లున్నాడు. వారు గొంతు సవరించుకోగానే అందరి నోళ్ళూ మూతపడ్డాయి. కొన్ని జతల చెవులు వారు చెప్పే విషయం వినడానికి ఆసక్తిగా ఎదురు చూశాయి.

ఏం? శ్రీకాంత్! నీ పెళ్ళి విషయం ఏమాలోచించావు? మామయ్య తొందరపడుతున్నాడు అన్నారు మురళయ్యగారు.

నా అభిప్రాయమెప్పుడో చెప్పాను. ఆ ప్రస్తావన మళ్ళీ ఇప్పుడెందుకు? కోపంగా అన్నాడు శ్రీకాంత్.

నీ మరదలు పిల్ల చూడ్డానికి బాగానే వుంటుంది. అంతో ఇంతో చదువుకుంది. ముఖ్యంగా నీవంటే ఇష్టపడుతుంది. ఏమిటట నీ అభ్యంతరం? అధికార పూర్వకంగానే అన్నారు మా మామగారు.

ఆ విషయాలన్నీ అటుంచండి. నాకు నచ్చని విషయం ఏమిటో చెపుతున్నాను. ధైర్యం వుంటే విని అరిగించుకోండి. అని తన అయిష్టానికి అసలు కారణం బయటపెట్టాడు శ్రీకాంత్. ఆడపిల్లలను, మగపిల్లలను సమానంగా చూడడం తల్లిదండ్రుల కనీస ధర్మం. కానీ అదేమిటో కొందరు తల్లిదండ్రులు మగపిల్లలను, వాళ్ళ పిల్లలను మాత్రమే ఆత్మీయంగా చూస్తారు. ఆడపిల్లలను, వాళ్ళ పిల్లలను అసలు పట్టించుకోరు. మరికొందరు తల్లిదండ్రులు ఇందుకు పూర్తిగా వ్యతిరేకం. మొదటి వర్గానికి ప్రతినిధులు మీరు. రెండు వైపుల నుండి ప్రేమను పొందలేని దౌర్భాగ్యులము మేము. అందుకే మీ అమ్మాయిని చేసుకోవడం, ప్రేమ రాహిత్యాన్ని పెంచి పోషించడం నాకు సుతరామూ ఇష్టంలేదు. ఇంకా ఏదో చెబుతున్నాడు శ్రీకాంత్. అందరూ అవాక్కై వింటున్నారు. చిన్న పిల్లాడిలా కనిపించే శ్రీకాంత్‌లో అంత భావావేశం వుందని, ఆ కుటుంబ మంటే అంత వ్యతిరేకత వుందని అప్పటిదాకా నాకే తెలియదు.

అదంతా నీ ఊహ మాత్రమే. నా సమదృష్టికి వచ్చిన కొదువేమీ లేదు. పోనీ అలా వేరువేరుగా చూసిన సంఘటన ఒకటి చెప్పు? పొరపాటైతే సరిదిద్దుకుంటాను. అసహనంగా అన్నారు మా మామగారు.

చదువు కోసం మీ ఇంట్లో వున్న రెండేండ్లలో జరిగిన అనుభవాలు ఎన్నని? మీ పిల్లలు చిన్నగా దగ్గినా ఆపసోపాలు పడుతూ హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు. నేను కాళ్ళ నొప్పులతో మూడు రోజులు పడుకుంటే మాట్లాడించే తీరిక దొరకలేదు మీకు. మీ మనవడి పుట్టిన రోజూ, నా పుట్టిన రోజూ ఒకటీ రెండు రోజుల తేడాతో వచ్చాయి. కొడుకు కొడుకు కాబట్టి పుట్టిన రోజు ఘనంగా చేసి వంద రూపాయల నోటు వంశీ చేతిలో పెట్టారు. నేను బిడ్డ కొడుకును కాబట్టి నా పుట్టిన రోజు మీకెవరికీ పండగలా అనిపించలేదు. నా చేతిలో పది రూపాయలు పెట్టి చేతులు దులుపుకున్నారు. శ్రీకాంత్ భావావేశం కొనసాగుతూనే వుంది.

అవన్నీ మాకు తెలియని విషయాలు కావు. పెద్దవాళ్ళం కాబట్టి సహిస్తూ వచ్చాం. ప్రేమనేది సహజంగా కలగాలని, బలవంతంగా వచ్చేది కాదని సరిపెట్టుకున్నాం. కానీ నేటి యువతకు ప్రతినిధియైన శ్రీకాంత్ సహించలేకపోయాడు. అందుకే ఇలా బయటపడ్డాడు.

"జరిగిందేదో జరిగింది" పోనీలెమ్మని సైగలతోనే వారించబోయాను నేను. కానీ, వాడి ఆవేశాన్ని ఆపలేకపోయాను.

మేమేం మీ ఆస్తిపాస్తులు పంచిమ్మని అడగడం లేదు. ప్రేమ రాహిత్యాన్నే సహించలేక పోతున్నాను. అందుకే ప్రేమకు తావులేని మీ కుటుంబంతో సంబంధం వద్దనుకున్నాను. "ఇదిగోండి" నాకు మొట్టమొదటి సారిగా మీరిచ్చిన "బర్త్-డే" గిఫ్ట్ అంటూ పది రూపాయల నోటు మామగారి చేతిలో పెట్టి, అక్కడి నుండి వెళ్ళి పోయాడు శ్రీకాంత్.

ఎలాగైతేనేం? సస్పెన్సు తీరిపోయింది. ఆ పది రూపాయల నోటు వెనుక ఇంత కథ వుందన్నమాట. అక్కడున్న వారంతా ఈ 'రసాభాస'ను తట్టుకోలేక పోతుంటే నేను మాత్రం అసలు రహస్యం తెలిసినందుకు సంతోషించి తేలికగా నిట్టూర్చాను.

దేవుడు మనిషికి రెండు కళ్ళిచ్చినా చూసేది ఒకే దృశ్యాన్ని. కానీ మనిషికెందుకో సమదృష్టి అలవడలేదు. మా పిల్లలు రెండు రకాలుగా, రెండు వైపుల నుండీ ప్రేమను నోచుకోనివారే. అందుకే శ్రీకాంత్‌లో అంత అసహనం, కోపం... ■